

అంతర్గత రోడ్ల అభివృద్ధి

తిరుపతి నగరంలో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయని తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. - 8లో



అపూర్వ స్వాగతం

పాకాల మండలం, తలారిపల్లి గ్రామంలో చంద్రగిరి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డికి అపూర్వ స్వాగతం లభించింది. - 8లో

	గరిష్టం	కనిష్టం
తిరుపతి	37	27
చిత్తూరు	36	26
తిరుమల	32	22
గూడూరు	38	28
నగరి	37	27

న్యూస్‌రీల్

శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు నిండాయి. క్యూలైన్ శిలాతోరణం వద్దకు చేరింది. గురువారం అర్ధరాత్రి వరకు 67,300 మంది స్వామివారిని దర్శించుకోగా.. 32,802 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.83 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతుండగా.. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 24 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

నైతిక విలువలతోనే గుర్తింపు



మాట్లాడుతున్న ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి

తిరుపతి క్రైం: పోలీస్ అధికారులు, సిబ్బంది నైతిక విలువలను పాటిస్తూ క్రమశిక్షణతో విధులు నిర్వహించాలని ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి సూచించారు. శుక్రవారం పోలీస్ పరేడ్ గ్రౌండ్లో పోలీస్ అధికారులు, సిబ్బందికి పోలీస్ సంక్షేమ దివాస్ కార్యక్రమం నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ శాఖాపరమైన అంశాలు ఏవైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ప్రతి శుక్రవారం పోలీస్ ప్రధాన కార్యాలయంలో సంక్షేమ దివాస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలిపారు. సిబ్బంది ఆరోగ్యం విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. జిల్లా ఏఆర్ అదనపు ఎస్పీ లక్ష్మీనారాయణరెడ్డి, డీఎస్పీలు రవీంద్రారెడ్డి, నందకిషోర్ పాల్గొన్నారు.

గడువు కోరకండి




మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి

తిరుపతి అర్బన్: ప్రతి విభాగానికి చెందిన అధికారులు ఇచ్చిన సమయంలోపు పని పూర్తిచేయాలని.. అదనపు సమయం కోరవద్దని కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో శుక్రవారం అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇప్పటి వరకు 487 సచివాలయ భవనాలకుగాను 225, 431 వెఎస్సార్ రైతు భరోసా కేంద్రాలకుగాను 183, 385 హెల్త్‌క్లినిక్స్‌కుగాను 83 భవనాలు మాత్రమే పూర్తిచేశారన్నారు. సెప్టెంబర్ 30వ తేదీనాటికి వంద శాతం పూర్తవ్వాలని పంచాయతీరాజ్ ఎస్ఈ శంకర్‌నారాయణను ఆదేశించారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా ప్రతి కుటుంబంలోని సమస్యలను గుర్తించాలని చెప్పారు. జిల్లాలో మరో 1.87 లక్షల కుటుంబాలకు అవసరమైన ధ్రువ పత్రాలు పంపిణీ చేయనున్నట్టు వెల్లడించారు. సురక్ష కార్యక్రమాన్ని మరింత పటిష్టంగా చేపట్టాలని డీఎల్‌డీవో, సచివాలయాల ఇన్‌చార్జి సుశీలాదేవిని ఆదేశించారు. సమీక్షలో డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రీహరి, ఐసీడీఎస్ పీడీ జయలక్ష్మి, డీఈవో వీ.శేఖర్, ఆర్‌అండ్‌బీ అధికారి సుధాకర్‌రెడ్డి, సేట్విన్ సీఈఓ మురళీకృష్ణ, డీఐఓ శాంతకుమారి, డీపీఎం దివ్య, కిరణ్‌నాయక్, ప్రోగ్రాం ఆఫీసర్‌లు కిరణ్, వికాస్, శ్రీనివాసులరెడ్డి, డీఎల్‌డీఓ ఆదిశేషారెడ్డి, కోఆర్డనేటర్ జగదీష్, డీఆర్‌డీఏ పీడీ జ్యోతి పాల్గొన్నారు.

16న డయల్ యువర్ ఈఓ

తిరుమల: డయల్ యువర్ టీటీడీ ఈవో కార్యక్రమం ఈనెల 16వ తేదీ ఆదివారం ఉదయం 9 నుంచి 10 గంటల వరకు తిరుమల అన్నమయ్య భవనంలో జరుగనుంది. ఈ కార్యక్రమాన్ని శ్రీ వేంకటేశ్వర భక్తి చానల్ ప్రత్యక్ష ప్రసారం చేస్తుంది. భక్తులు తమ సందేహాలను, సూచనలను టీటీడీ ఈవో ధర్మారెడ్డికి ఫోన్ ద్వారా నేరుగా మాట్లాడి తెలుపవచ్చు. ఇందుకు భక్తులు 0877-2263261 నంబర్‌ను సంప్రదించాలని టీటీడీ తెలియజేసింది.

రేపు చంద్రగిరిలో లవకుశ నాటక ప్రదర్శన



మాట్లాడుతున్న కోనేటి సుబ్బరాజు

తిరుపతి కల్చరల్: సుబ్బరాజు నాట్య కళాపరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం 4 గంటలకు చంద్రగిరి బస్టాండ్ క్లాక్ టవర్ సెంటర్ వద్ద లవకుశ పౌరాణిక పద్యనాటకాన్ని ప్రదర్శించనున్నట్లు సంస్థ అధ్యక్షుడు కోనేటి సుబ్బరాజు తెలిపారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. చంద్రగిరిలోని శ్రీకోదండరామస్వామి వారి ఆలయ ప్రాశస్త్యాన్ని మరింత ప్రచారం చేయాలనే సంకల్పంతో లవకుశ నాటకాన్ని ఉచితంగా ప్రదర్శిస్తున్నట్టు వెల్లడించారు.

జాబిలితో చెప్పనా!

నిప్పులు చిమ్ముతూ.. మబ్బులు చీల్చుకుంటూ.. జాబిల్లి వైపు దూసుకెళ్లిన చంద్రయాన్–3 ప్రయోగం విజయవంతంతో స్థానికులు సంబరాల్లో మునిగితేలారు. ఈలలేస్తూ చప్పట్లతో సాగనంపారు. జెండాలూపుతూ విజయగర్వంతో ఊగిపోయారు. నింగిలో కనిపిస్తున్నంత సేపు మునివేళ్లపై నిలబడి తదేకంగా చూస్తూ నిలబడిపోయారు. కొందరు బైనాక్యులర్లతో చూసి ఆనంద సాగరంలో మునిగితేలారు. మరికొందరు తమ సెల్‌ఫోన్లలో బంధించి మురిసిపోయారు. నెలరాజుపై సాఫీగా దిగి..నిగూఢ రహస్యాలు ఛేదించాలని ఆకాంక్షించారు.



నిప్పులు చిమ్ముతూ నింగిలోకి దూసుకెళ్తున్న ఎల్‌వీఎం3-ఎం4 రాకెట్



విడిపోతున్న బూస్టర్లు | విడిపోతున్న హీట్‌షీల్డ్స్ | ద్రవ ఇంధనంతో నింగివైపు.. | రెండోదశలో విడిపోతూ.. | కక్ష్యలోకి వెళుతున్న చంద్రయాన్-3 | చంద్రయాన్-3 ఉపగ్రహాన్ని కక్ష్యలోకి ప్రవేశపెడుతూ

సూళ్లూరుపేట: భారత అంతరిక్ష ప్రయోగ కేంద్రం సతీష్ ధవన్ స్పేస్ సెంటర్ షార్‌లోని రెండో ప్రయోగ వేదిక నుంచి శుక్రవారం మధ్యాహ్నం 2.35 గంటలకు ఎల్‌వీఎం 3–ఎం4 రాకెట్ ద్వారా చంద్రయాన్–3 మిషన్‌ను విజయవంతంగా ప్రయోగించారు. ఈ ప్రయోగం పూర్తిస్థాయిలో విజయం సాధించాలంటే ఆగస్టు 23 దాకా వేచి చూడాల్సి ఉన్నప్పటికీ ఎల్‌వీఎం3–ఎం4 రాకెట్ 3,920 కిలోల బరువు కలిగిన చంద్రయాన్–3 ఉపగ్రహాన్ని నిర్ణీత సమయంలో నిర్దేశిత కక్ష్యలోకి విజయవంతంగా ప్రవేశపెట్టి మొదటి దశ విజయాన్ని అందుకున్నారు.

మూడు దశల రాకెట్ ప్రయాణం ఇలా..

ఎల్‌వీఎం3–ఎం4 రాకెట్ 43.43 పొడవు కలిగి 640 టన్నుల బరువుతో శ్రీహరికోట రాకెట్ కేంద్రం నుంచి నింగిలోకి నిప్పులు చిమ్ముకుంటూ మూడు దశలను ఛేదిస్తూ విజయవంతంగా దూసుకెళ్లింది. చంద్రయాన్–3 ఉపగ్రహంలో 2,145 కిలోల బరువు కలిగిన ప్రపొల్షన్ మాడ్యూల్, 1,749 కిలోల బరువు కలిగిన ల్యాండర్, 26 కిలోల బరువు కలిగిన రోవర్‌లను చందమామపై పరిశోధనలకు విజయవంతంగా పంపించారు. ఇందులో ఆరు ఇండియన్ పేలోడ్స్‌తో పాటు అమెరికా నాసాకు చెందిన ఒక పేలోడ్‌ను పంపించారు.

- మొదటి దశలో ఇరువైపులా అత్యంత శక్తివంతమైన ఎస్–200 బూస్టర్లు సాయంతో నింగికి పయనమై రెండు స్ట్రాపాన్ బూస్టర్లులో 400 టన్నుల ఘన ఇంధనం సాయంతో 127 సెకెండ్లలో మొదటి దశ పూర్తి చేశారు.
- రెండో దశలో ఎల్–110 అంటే 110 టన్నుల ద్రవ ఇంధనాన్ని ఉపయోగించి 305.56 సెకండ్లకు రెండో దశను పూర్తి చేశారు.

ఈ మధ్యలో 194.96 సెకండ్లకు రాకెట్ శిఖర భాగాన చంద్రయాన్–3 మిషన్‌కు రెండువైపులా అమర్చిన హీట్‌షీల్డ్స్ విడిపోయాయి.

- మూడోదశలో 958.71 సెకండ్లకు 25 టన్నుల క్రయోజనిక్ ఇంధనాన్ని వినియోగించి 954.42 సెకండ్లకు కటాఫ్ చేశారు.

రాకెట్‌కు శిఖరభాగాన అమర్చిన త్రీ–ఇన్–వన్ మిషన్ చంద్రయాన్–3 ఉపగ్రహాన్ని భూమికి దూరంగా (అపోజి) 36,500 కిలోమీటర్ల ఎత్తులో హైలీ ఎసిన్‌ట్రిక్ ఆర్బిట్(అత్యంత విపరీతమైన కక్ష్య)లోకి ప్రవేశపెట్టి చరిత్రాత్మకమైన విజయాన్ని నమోదు చేశారు.



- చంద్రయాన్-3 ప్రయోగం విజయవంతం
- భూకక్ష్యలోకి చేరిన ఉపగ్రహాలు
- ఉత్కంఠగా ఎదురు చూసిన స్థానికులు
- ప్రేక్షకులతో నిండిన గ్యాలరీలు
- శాస్త్రవేత్తలకు వెల్లువెత్తిన అభినందనలు

ఇస్రో బృందానికి శ్రీసిటీ ఎండీ అభినందనలు

తడ: శ్రీహరికోట నుంచి శుక్రవారం లాంచ్ వెహికల్ మార్క్– 3 ద్వారా చంద్రయాన్–3ని విజయవంతంగా భూ కక్ష్యలో ప్రవేశ పెట్టిన ఇస్రో బృందానికి శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి అభినందనలు తెలిపారు. భారత ఖ్యాతిని ప్రపంచానికి వ్యాప్తి చేసిన ఇస్రో చైర్మన్ ఎస్ సోమనాథ్, షార్ డైరెక్టర్ రాజరాజన్, ఇతర శాస్త్రవేత్తలను ఆయన అభినందించారు.

చప్పట్లతో మార్మోగిన గ్యాలరీలు

సతీష్ ధవన్ స్పేస్‌సెంటర్ షార్ నుంచి శుక్రవారం మధ్యాహ్నం 2.35 గంటలకు ప్రయోగించిన ఎల్‌వీఎం3–ఎం4 ప్రయోగాన్ని వీక్షించేందుకు ఆంధ్ర, తమిళనాడు, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల నుంచే కాకుండా రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి సుమారు పది వేల మందిదాకా విచ్చేశారు. సూళ్లూరుపేట నుంచి శ్రీహరికోట వరకు కార్లు, స్కూల్ వ్యాన్‌లు, బస్సులు బారులు తీరాయి. అయితే షార్ కేంద్రం వారు మాత్రం ప్రతి రాకెట్ ప్రయోగాన్ని వీక్షించేందుకు అనువుగా శ్రీహరికోటలోనే ఒక ప్రత్యేక గాలరీని ఏర్పాటు చేశారు. జమ్ము కశ్మీర్ నుంచి కూడా వీక్షకులు తరలివచ్చారు. రాకెట్ ప్రయోగాన్ని వీక్షించాలనుకునే వారితో పులికాట్ సరస్సులోని రోడ్డు కిక్కిరిసింది. రాకెట్ నింగికేగుతున్న సమయంలో వారంతా కొట్టిన చప్పట్లు, ఈలలు, కేకలతో ఆ ప్రాంతమంతా మార్మోగింది.



జైహింద్: రాకెట్ ప్రయోగాన్ని ఆసక్తిగా తిలకిస్తున్న వీక్షకులు



జయహో: వీక్షకులతో కిక్కిరిసిన గ్యాలరీలు

కనెక్టవిటీ పెరిగేలా.. నగరం విస్తరించేలా!

- తిరునగరికి మరో రోడ్డు
- ఎమ్మార్‌పల్లె కూడలి నుంచి మహిళా వర్సిటీని కలుపుతూ రోడ్డు నిర్మాణం
- తీరనున్న ట్రాఫిక్ కష్టాలు
- శ్రీమతి పంగులూరి సీతమ్మ రోడ్డుగా నామకరణం
- నేడు ప్రారంభోత్సవానికి సర్వం సిద్ధం



ప్రారంభానికి సిద్ధమైన పంగులూరి సీతమ్మ రోడ్డు

తిరుపతి తుడా: ఆధ్యాత్మిక తిరునగరిలో రోడ్లకు మహర్దశ పట్టుకుంది. నగర విస్తరణ, అభివృద్ధి కొంత భాగానికే పరిమితం కావడం వల్ల నగరంపై ఒత్తిడి పెరిగింది. ట్రాఫిక్ ఇక్కట్లు, సరైన కనెక్టివిటీ లేకపోవడం తిరుపతి నగరానికి శాపంగా మారింది. దశాబ్దాలుగా ఉన్న రోడ్లతోనే రవాణా వ్యవస్థ నడవాల్సిన దుస్థితి ఏర్పడింది. ఈ లోపాలను గుర్తించిన పాలకులు వాటిని అధిగమించడంపైనే ప్రధానంగా దృష్టి సారించారు. ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి నేతృత్వంలో డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి ఆలోచనలతో మున్సిపల్ కార్పొరేషన్ కౌన్సిల్ ఏకగ్రీవ ఆమోదంతో వందల కోట్ల రూపాయలతో రోడ్ల అభివృద్ధి పనులు చకచకా జరిగిపోతున్నాయి. నగర కనెక్టివిటీ, విస్తరణే లక్ష్యంగా 18 మాస్టర్ ప్లాన్ రోడ్లను అభివృద్ధి చేస్తుండగా.. వాటిలో ఇప్పటికే ఎనిమిది రోడ్లు అందుబాటులోకి వచ్చాయి. మరో ఆరు రోడ్లు దాదాపుగా పూర్తి కావచ్చాయి. ఇందులో భాగంగానే ఎంఆర్‌పల్లి కూడలి నుంచి మహిళా యూనివర్సిటీ రోడ్డును కలుపుతూ నిర్మించిన శ్రీమతి పంగులూరి సీతమ్మ రోడ్డు శనివారం ప్రారంభానికి సిద్ధమైంది.

ట్రాఫిక్ కష్టాలకు చెక్

ఎమ్మార్‌పల్లె పరిసర ప్రాంతాలు అభివృద్ధి చెందిన ఏరియాగా మంచి గుర్తింపు ఉంది. ఎయిర్ బైపాస్ రోడ్డు మీదుగా నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఎమ్మార్‌పల్లె కూడలి నుంచి మహిళా యూనివర్సిటీకి వెళ్లాలంటే ఇరుకు రోడ్లతోపాటు మూడు కిలోమీటర్ల మేర చుట్టు తిరిగి వెళ్లాల్సిన పరిస్థితి. ప్రస్తుతం నిర్మించిన శ్రీమతి పంగళూరి సీతమ్మ రోడ్డుతో దూరం తగ్గి.. కిలోమీటరు దూరంలోనే గమ్యాన్ని చేరుకోవచ్చు. అలాగే ఎయిర్ బైపాస్ రోడ్డు నుంచి ఉప్పరపల్లి మీదుగా నేషనల్ హైవేకి సులువుగా చేరుకోవచ్చు.

రోడ్డు నిర్మాణ రూపకర్త :
డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి

పొడవు : 1 కి.మీ

వెడల్పు : 80 అడుగులు

వ్యయం: రూ.5.3 కోట్లు

(బీటీ (తారు) రోడ్డు, రోడ్డుకు మధ్యలో డివైడర్, ఆధునిక లైటింగ్, గ్రీనరీ పెంపు)

సుందర రహదారి



శ్రీమతి పంగులూరి సీతమ్మ మార్గం

పంగుళూరి సీతమ్మ రోడ్డు నిర్మాణానికి డెప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి విశేష కృషి చేశారు. ట్రస్ట్‌తో పాటు స్థానికులను ఒప్పించి ఎలాంటి లీగల్ సమస్యలు లేకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. రూ 5.3 కోట్ల వ్యయంతో తారు రోడ్డును నిర్మించారు. 80 అడుగుల రోడ్డుకు మధ్యలో డివైడర్, విద్యుత్ వెలుగులు, డివైడర్ లో గ్రీనరీ పెంపు, జీబ్రా లైన్స్ తో రోడ్డును సుందరంగా తీర్చిదిద్దారు. శనివారం ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మేయర్ శిరీష, కమిషనర్ హరిత, డిప్యూటీ మేయర్లు ముద్ర నారాయణ, భూమన అభినయ్‌రెడ్డితో కలిసి ప్రారంభించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు.

ప్రారంభోత్సవానికి సిద్ధం

శ్రీమతి పంగులూరి సీతమ్మ మాస్టర్ ప్లాన్ రోడ్డు అత్యంత సుందరంగా నిర్మించాం. కేవలం 6 నెలల్లోనే రోడ్డు నిర్మాణ పనులు పూర్తయ్యాయి. ఈ రోడ్డుతో నగరానికి మరింత కనెక్టివిటీ పెరిగింది.

– డీ.హరిత, కమిషనర్, తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్

మాటల్లో కాదు..చేతల్లోనే

తిరుపతి నగరం కొంత భాగంలోనే విస్తరించడానికి రోడ్లు లేకపోవడమే ప్రధాన కారణం. ఈ లోటును అధిగమించేందుకు 18 మాస్టర్ ప్లాన్ రోడ్లకు శ్రీకారం చుట్టాం. సుమారు 5 వేల ఎకరాల్లో నగరం విస్తరించేలా ప్రణాళికలు రచించాం. మాటల్లో కాకుండా అభివృద్ధిని చేతల్లో చేసి చూపిస్తున్నాం.

– భూమన అభినయ్‌రెడ్డి, డిప్యూటీ మేయర్, తిరుపతి

• గెలుపే లక్ష్యం



చిత్తూరు, అన్నమయ్య జిల్లాల ఎమ్మెల్యేలు, సమన్వయకర్తలతో సమావేశమైన మంత్రి పెద్దిరెడ్డి , ఎంపీ మిథున్‌రెడ్డి

వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పార్టీ అభ్యున్నతికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని రాష్ట్ర అటవీ, విద్యుత్, భూగర్భ గనులశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డి పిలుపునిచ్చారు. తిరుపతి పీఎల్ఆర్ కన్వెన్షన్ హాల్లో శుక్రవారం చిత్తూరు, అన్నమయ్య జిల్లాల ఎమ్మెల్యేలు, సమన్వకర్తలతో వారు సమావేశమయ్యారు. ఆయా జిల్లాల్లోని నియోజకవర్గాల్లో పార్టీ బలోపేతం, వచ్చే ఎన్నికల్లో గెలుపుపై మంత్రి, ఎంపీ దిశానిర్దేశం చేశారు.

– తిరుపతి మంగళం

సీఎం సభాస్థలి ఏర్పాట్ల పరిశీలన



సభా స్థలిని పరిశీలిస్తున్న తలశిల రఘురామ్, రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరి: వెంకటగిరిలో ఈనెల 21న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా వైఎస్సార్ నేతన్న నేస్తం ఐదో విడత నిధులు విడుదల చేయనున్నారు. ఈ మేరకు శుక్రవారం హెలీప్యాడ్, సభాస్థలికి సంబంధించి సీఎం ప్రోగ్రాం కో–ఆర్డినేటర్, ఎమ్మెల్సీ తలశిల రఘురాంతో కలిసి తిరుపతి జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి వెంకటగిరిలోని పలు ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం రామ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం బహిరంగ సభకు ఇండియన్ హ్యాండ్‌లూమ్ టెక్నాలజీకి చేరువలోని స్థలాన్ని, హెలీప్యాడ్ కోసం ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానాన్ని ఎంపిక చేసినట్టు తెలిపారు. అనంతరం ఆయన వెంకటగిరి మున్సిపల్ కౌన్సిలర్లు, పార్టీ శ్రేణులతో సమావేశమయ్యారు. మున్సిపల్ చైర్‌పర్సన్ నక్కా భానుప్రియ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ దొంతుశారద, గూడూరు ఆర్డీఓ కిరణ్‌కుమార్, డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తం.. పవిత్ర సమర్పణం



సీతారామలక్ష్మణులకు హారతి సమర్పిస్తున్న అర్చకులు

తిరుపతి కల్చరల్: శ్రీకోదండరామస్వామి ఆలయ పవిత్రోత్సవాల్లో భాగంగా రెండో రోజు శుక్రవారం శాస్త్రోక్తంగా పవిత్ర సమర్పణ నిర్వహించారు. ఉదయం స్వామివారిని సుప్రభా తంతో మేల్కొలిపి తోమాలసేవ, సహస్రనామార్చన చేపట్టారు. సీతారామ లక్ష్మణుల ఉత్సవమూర్తులను యాగశాలకు వేంచేపు చేశారు. విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, కుంభారాధన, ఉక్తహోమాలు నిర్వహించారు. ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం వేడుకగా జరిపించారు. పాలు, పెరుగు, తేనె, చందనం, కొబ్బరినీళ్లతో అభిషేకం చేశారు. అనంతరం యాగశాలలో పవిత్రమాలలకు ఉపచారాలు చేపట్టి ప్రదక్షిణగా సన్నిధి వీధికి వేంచేపు చేశారు. ధ్రువమూర్తులు, కైతుక మూర్తులు, స్నపనమూర్తులకు బలిమూర్తులకు పవిత్రాలు సమర్పించారు. అదే విధంగా విష్వక్సేన, ద్వారపాలకులు, భాష్యకార్లు, గరుడాళ్వార్, యాగశాలలోని హోమగుండాలు, బలిపీఠం, ధ్వజస్తంభం, ఆంజనేయస్వామి వారికి పవిత్రాలు అందజేశారు.సాయంత్రం సీతారామలక్ష్మణులు బంగారు తిరుచ్చిని అధిరోహించి మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు.

క్లుప్తంగా

ఇస్రో శాస్త్రవేత్తలకు ఎంపీ, ఎమ్మెల్యే అభినందనలు

సూళ్లూరుపేట: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) శాస్త్రవేత్తలు శుక్రవారం మధ్యాహ్నం ఎల్‌వీఎం3-ఎం4 ద్వారా చంద్రయాన్‌-3 ప్రయోగాన్ని విజయవంతంగా నిర్వహించి మరోమారు చరిత్ర సృష్టించారని ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య శాస్త్రవేత్తలను అభినందిస్తున్నామని తెలిపారు. ఎంపీ మాత్రం షార్‌కు విచ్చేసి మిషన్‌ కంట్రోల్‌ సెంటర్‌ నుంచి ప్రయోగాన్ని వీక్షించారు. ఆయన మాట్లాడుతూ ముచ్చటగా మూడోసారి చంద్రుడి మీద పరిశోధనలు చేసేందుకు ఈ ప్రయోగాన్ని నిర్వహించి విజయం సాధించినందుకు వారికి ప్రత్యేకంగా అభినందనలు తెలియజేస్తున్నామని చెప్పారు. ఎల్‌వీఎం3 లాంటి భారీ రాకెట్‌ ప్రయోగాలను కూడా విజయవంతంగా ప్రయోగించి ఇస్రో ఖ్యాతిని దశ దిశలా వ్యాపింపచేస్తున్న ఇస్రో చైర్మన్‌ ఎస్‌.సోమనాథ్‌, షార్‌ డైరెక్టర్‌ ఏ.రాజరాజన్‌లతో పాటు ఈ ప్రయోగంలో పాలుపంచుకున్న ప్రతి ఒక్క శాస్త్రవేత్తలకు, షార్‌ ఉద్యోగులను వార ప్రత్యేకంగా ప్రశంసించారు.

చంద్రయాన్‌-3 ప్రయోగంలో మహిళా శక్తి

సూళ్లూరుపేట: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) అత్యంత ప్రతిష్టాత్మకంగా శుక్రవారం మధ్యాహ్నం ప్రయోగించిన చంద్రయాన్‌-3 ప్రాజెక్టులో 30 శాతం మంది మహిళా శాస్త్రవేత్తలు పనిచేసినట్టు తెలుస్తోంది. అంతరిక్ష శాస్త్ర విజ్ఞాన రంగం, శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడంలో తామేమీ తక్కువ కాదన్నట్టుగా చంద్రయాన్‌-2 ప్రయోగంలో పనిచేసిన 30 శాతం మంది మహిళలు, చంద్రయాన్‌-3లో కూడా పనిచేశారు. త్రీ-ఇన్‌-ఒన్‌గా చెప్పబడుతున్న చంద్రయాన్‌-3 ప్రాజెక్టులో ప్రపొల్షన్‌ మాడ్యూల్‌, ల్యాండర్‌, రోవర్లు రూపొందించడంలో మహిళా శాస్త్రవేత్తల కృషి కూడా ఉంది. అహ్మదాబాద్‌లోని స్పేస్‌ అప్లికేషన్‌ సెంటర్‌, బెంగళూరులోని ప్రొఫెసర్‌ యూఆర్‌ రావు శాటిలైట్‌ సెంటర్‌లో పురుష శాస్త్రవేత్తలకన్నా తామేమీ తక్కువ కాదన్నట్టుగా పనిచేసి ల్యాండర్‌, రోవర్‌ను రూపొందించడంలో మహిళా శాస్త్రవేత్తలు భాగస్వామ్యం కూడా కలిసింది. ఇస్రోలో 30 మంది మహిళా శాస్త్రవేత్తలు పనిచేస్తుండగా ఈ ప్రయోగంలో రీతూ కరిథల్‌, ఎం.వనిత అత్యంత కీలక వ్యక్తులుగా పనిచేశారు. బాలు శ్రీ దేశాయ్‌, డాక్టర్‌ సీత, కే కల్పన, టెస్సీ థామస్‌, డాక్టర్‌ నేహ సటక్‌ తదితర మహిళా శాస్త్రవేత్తలు ఈ ప్రయోగంలో భాగస్వాములై మహిళాశక్తిని నిరూపించారు.


మిషన్‌ కంట్రోల్‌ సెంటర్‌లో చంద్రయాన్‌-3 ప్రయోగాన్ని వీక్షిస్తున్న మహిళా శాస్త్రవేత్తలు

రాకెట్‌ ఉమెన్‌ ఆఫ్‌ ఇండియా రీతూ కరిథల్‌

చంద్రయాన్‌-2 మిషన్‌ డైరెక్టర్‌గా వ్యవహరించిన రీతూ కరిథల్‌ 'రాకెట్‌ ఉమెన్‌ ఆఫ్‌ ఇండియా'గా ఇస్రోలో అందరూ పిలుస్తున్నారు. మార్స్‌ అర్బిటర్‌ మిషన్‌ ప్రయోగంలో కూడా ఆమె డిప్యూటీ ఆపరేషన్‌ డైరెక్టర్‌గా పనిచేశారు. ఈమె 2007లో మాజీ రాష్ట్రపతి, అణు పరీక్షల నిపుణులు దివంగత డాక్టర్‌ ఏపీజే అబ్దుల్‌కలాం చేతులు మీదగా ఇస్రో యంగ్‌ సైంటిస్ట్‌ అవార్డు కూడా అందుకున్నారు. చంద్రయాన్‌-2 మిషన్‌లో అత్యంత కీలకమైన మహిళా శాస్త్రవేత్తగా అందరి మన్ననలను పొందారు. ఆమె చంద్రయాన్‌-3 ప్రాజెక్టులో కూడా పనిచేశారు. చంద్రయాన్‌-2 ప్రాజెక్టుకు డైరెక్టర్‌గా పనిచేసిన ఎం.వనిత ఉపగ్రహాలు తయారు చేయడంలో దిట్ట. ఆమె డిజైన్‌ ఇంజినీర్‌గా శిక్షణ తీసుకుని చంద్రయాన్‌-2 అత్యంత కీలకమైన శాస్త్రవేత్తగా ఎంతో గుర్తింపు పొందారు. 'ఆస్ట్రనామికల్‌ సొసైటీ ఆఫ్‌ ఇండియా' నుంచి 2006లో బెస్ట్‌ ఉమెన్‌ సైంటిస్టు అవార్డును అందుకున్నారు. చంద్రయాన్‌-3 ప్రాజెక్టులోనూ ఆమె కీలకపాత్ర పోషించారు.

బాధ్యతాయుతంగా ఓటర్ల జాబితా సవరణ

వరదయ్యపాళెం: గ్రామస్థాయిలో ఇంటింటా సర్వే చేపట్టిన తర్వాతే ఓటర్ల జాబితా సవరణ జరుగుతుందని సత్యవేడు నియోజకవర్గ రిటర్నింగ్‌ అధికారి, స్పెషల్‌ డిప్యూటీ కలెక్టర్‌ ఎం.శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం వరదయ్యపాళెం ఎంపీడీఓ కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీలతో అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించి ఓటర్ల జాబితా సవరణ గురించి చర్చించారు. స్థానికంగా బీఎల్‌ఓలు ఇంటింటా సర్వే నిర్వహించిన తర్వాతే సవరణ జరుగుతుందని పేర్కొన్నారు. గ్రామస్థాయిలో గ్రామ సర్పంచ్‌ బీఎల్‌ఓల నిర్ధారణతోనే మార్పులు, చేర్పులు జరుగుతాయన్నారు. ఉద్యోగరీత్యా బయట ప్రాంతాలకు వెళ్లే వారిని జాబితా నుంచి తొలగించలేమని, శాశ్వతంగా ఊరు వదిలి వెళ్లిన వారిని మాత్రమే తొలగిస్తామన్నారు. అంతేగాక కుటుంబ ప్రాతిపదికన ఒకే బూత్‌లోకి ఓటర్లందరూ వచ్చే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం అఖిలపక్ష నాయకుల విన్నపాలను స్వీకరించారు. కార్యక్రమంలో అఖిలపక్షం నాయకులు నాయుడు దయాకర్‌రెడ్డి (వైఎస్సార్‌సీపీ), ఆంబాకం చిన్నిరాజ్‌ (సీపీఐ), యుగంధర్‌ రెడ్డి (టీడీపీ), పురుషోత్తమ్‌ (బీజేపీ), తహసీల్దార్‌ గౌరిశంకరరావు పాల్గొన్నారు.


అఖిలపక్ష నేతల సమావేశంలో మాట్లాడుతున్న స్పెషల్‌ డిప్యూటీ కలెక్టర్‌ శ్రీనివాసులు

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

తడ: రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన శుక్రవారం మండలంలోని చేనిగుంట గిరిజన కాలనీ వద్ద చోటు చేసుకుంది. రైల్వే సిబ్బంది కథనం మేరకు.. చెన్నై వైపు వెళుతున్న రైలు ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతదేహం గుర్తు పట్టలేని విధంగా శరీర భాగాలు చెల్లా చదురుగా పడి ఉండడాన్ని స్థానికులు గుర్తించి రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని శరీర భాగాలను పోస్టుమార్టం నిమిత్తం సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.



బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.61,180
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,494

వెండి:

హోల్‌సేల్‌ ధర (కిలో)	రూ.77,100
రిటైల్‌ వెండి గ్రాము	రూ.79.10

శరవేగంగా అంతర్గత రోడ్ల అభివృద్ధి


సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, మేయర్‌ శిరీష, డెప్యూటీ మేయర్‌

తిరుపతి తుడా: నగరంలో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయని తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. నగరంలోని 22వ డివిజన్‌ పద్మావతీ నగర్‌లో రూ.1.35 కోట్లతో అభివృద్ధి చేసిన సీసీ రోడ్డును శుక్రవారం నగర మేయర్‌ డాక్టర్‌ శిరీష, కమిషనర్‌ హరిత, డిప్యూటీ మేయర్‌ ముద్ర నారాయణతో కలిసి ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మాటల్లో కాకుండా చేతల్లో అభివృద్ధి చేసి చూపించామని చెప్పారు. నగర కనెక్టివిటీ పెంచడం, నగర విస్తరణకు దోహదపడే మాస్టర్‌ప్లాన్‌ రోడ్ల అభివృద్ధి పనులు దాదాపుగా పూర్తయ్యాయని, అలానే నగరంలో ఇంటర్నల్‌ రోడ్ల అభివృద్ధికి ప్రణాళికలు రచించామని తెలిపారు. వాటిని డిసెంబర్‌ నాటికి పూర్తి చేస్తామని చెప్పారు. కార్పొరేటర్లు పైడి సునీత, డాక్టర్‌ ఆరణి సంధ్య, మునిరామిరెడ్డి, కో ఆప్షన్‌ సభ్యులు ఇమామ్‌ సాహెబ్‌, ఎస్‌.ఈ మోహన్‌, ఎంఈ చంద్రశేఖర్‌, డీఈ మహేష్‌, నాయకులు డిష్‌ చంద్ర, అనీల్‌, వెంకటముని రెడ్డి, మబ్బు నాద మునిరెడ్డి, తిమ్మారెడ్డి, కుమార్‌, బ్రహ్మానందరెడ్డి, మాకం చంద్ర, మనోహర్‌ రెడ్డి, రెడ్డిరాణి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలోకి టీడీపీ నేతలు

పాకాల(తిరుపతి రూరల్‌): పాకాల మండలం, ఇరంగారిపల్లి పంచాయతీ, తలారిపల్లికి చెందిన టీడీపీ నేతలు వైఎస్సార్‌సీపీలో చేరారు. శుక్రవారం రాములవారి గుడి వద్ద వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మోహిత్‌రెడ్డి నాయకత్వం, పార్టీ సిద్ధాంతాలు నచ్చడంతో పాటు సీఎం జగనన్న పాలన, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సేవాతత్వానికి ఆకర్షితులై పార్టీలో చేరినట్టు తెలిపారు. భవిష్యత్తులో తిరుగులేని పార్టీగా వైఎస్సార్‌సీపీ నిలుస్తుందని స్పష్టం చేశారు. వైఎస్సార్‌సీపీలో చేరిన వారిలో గుణశేఖర్‌, లక్ష్మీపతి, మోహిత్‌, విష్ణు, భారతి, సుమంత్‌, గుణశేఖర్‌, నస్రీన్‌ భాను, ధనమ్మ, బుజ్జి, నాగరాజ, మురళి, నరేష్‌, వాసు, ఉమ, మోహన్‌ తదితర 70 కుటుంబాల వారు ఉన్నారు.


తలారిపల్లిలో టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

తలారిపల్లిలో మోహిత్‌రెడ్డికి అపూర్వ స్వాగతం

పాకాల(తిరుపతి రూరల్‌): పాకాల మండలం, తలారిపల్లి గ్రామంలో గడపగడపకు మహా పాదయాత్ర కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ప్రతి గడపలో ప్రజలు మోహిత్‌ రెడ్డికి ఘనంగా స్వాగతం పలికారు. అంతకుముందు నాయకులు గజ మాలతో సత్కరించారు. అనంతరం లబ్ధిదారులకు సంక్షేమ బుక్‌ లెట్లను అందజేశారు. ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌ రెడ్డి ఆధ్వర్యంలో సంక్షేమం, అభివృద్ధి జరిగిందని నమ్మితేనే 2024 ఎన్నికల్లో ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. కరోనా, ప్రకృతి వైపరీత్యాల సమయంలో ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌ రెడ్డి చేసిన సేవలను వివరించారు. ప్రతి పల్లె అభివృద్ధి పథంలో దూసుకుపోతున్నట్లు వెల్లడించారు.


తలారిపల్లిలో సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తున్న చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

మెరుగైన విద్యుత్‌ అందించడమే లక్ష్యం


మాట్లాడుతున్న ఏపీ ఎస్పీడీసీఎల్‌ చైర్మన్‌, ఎండీ సంతోషరావు

గూడూరు రూరల్‌: వినియోగదారులకు మెరుగైన విద్యుత్‌ అందించడమే లక్ష్యంగా సంస్థలోని ప్రతి ఉద్యోగి పనిచేయాలని ఆంధ్రప్రదేశ్‌ దక్షిణ ప్రాంత విద్యుత్‌ పంపిణీ సంస్థ(ఏపీఎస్పీడీసీఎల్‌) చైర్మన్‌, మేనేజింగ్‌ డైరెక్టర్‌ కె.సంతోషరావు పిలుపునిచ్చారు. గూడూరులోని నారాయణ ఇంజినీరింగ్‌ కళాశాలలో శుక్రవారం గూడూరు డివిజన్‌ పరిధిలోని విద్యుత్‌ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వినియోగదారుడికి సంతృప్తికరమైన సేవలు అందిస్తేనే సంస్థ మనుగడ సాధిస్తుందన్నారు. విధుల్లో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రైతులకు పగటిపూట 9 గంటల విద్యుత్‌లో ఎలాంటి జాప్యం లేకుండా సరఫరా చేయాలని ఆదేశించారు. గూడూరు డివిజన్‌లో అత్యధికంగా విద్యుత్‌ బకాయిలు పేరుకుపోయాయని, వాటి వసూళ్లపై దృష్టిసారించాలని సూచించారు. విద్యుత్‌ అంతరాయం సమస్యలపై టోల్‌ ఫ్రీ నం.1912 లేదా 18004251555333కు కాల్‌ చేసి సమస్యను వివరించాలని కోరారు. సమావేశంలో చీఫ్‌ జనరల్‌ మేనేజర్‌ ఆపరేషన్‌ కె.గురవయ్య, చీఫ్‌ జనరల్‌ మేనేజర్‌ రెవెన్యూ, ఇంటర్నల్‌ ఆడిట్‌ కె.ఆర్‌.ఎస్‌.ధర్మజ్ఞాని, నెల్లూరు సర్కిల్‌ ఎస్‌ఈ బి.వెంకటసుబ్బయ్య, సీనియర్‌ అకౌంట్స్‌ ఆఫీసర్‌ మురళి, ఎగ్జిక్యూటివ్‌ ఇంజినీర్లు షేక్‌ ఇస్మాయిల్‌, శ్రీధర్‌, రాఘవేంద్రం, బెనర్జీ, మధు తదితరులు పాల్గొన్నారు.

చీటింగ్‌ కేసులో నిందితుడి అరెస్టు

చిత్తూరు అర్బన్‌: అధిక వడ్డీలు ఇస్తామని చిత్తూరులో పలువురి నుంచి నగదు వసూలు చేసి పారిపోయిన కేసులో నిందితుడు విజయ్‌ను వన్‌టౌన్‌ ఎస్‌ఐ వసంతకుమారి శుక్రవారం అరెస్టు చేశారు. ఏఆర్‌టీ జ్యూవెలర్స్‌ పేరిట పలువురి నుంచి పెద్ద మొత్తంలో నగదు వసూలు చేసిన విజయన్‌ గత కొన్నిరోజులుగా కనిపించడం లేదని, తమను మోసంచేసి పారిపోయాడని బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు, నిందితుడిని అరెస్టుచేసి కోర్టుకు తరలించారు. మేజిస్ట్రేట్‌ ఆదేశాలతో విజయ్‌ను చిత్తూరు జిల్లా జైలుకు తరలించారు.

రాష్ట్ర గవర్నర్‌కు స్వాగతం, వీడ్కోలు

రేణిగుంట: రాష్ట్ర గవర్నర్‌ అబ్దుల్‌ నజీర్‌కు శుక్రవారం రేణిగుంట విమానాశ్రయంలో ఘనస్వాగతం లభించింది. తిరుపతి పర్యటన నిమిత్తం విచ్చేసిన ఆయనకు కలెక్టర్‌ కే.వెంకటరమణారెడ్డి, ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి, నగర పాలక కమిషనర్‌ హరిత, కేంద్ర సాంస్కృతిక శాఖ సాహిత్య అకాడమీ కార్యదర్శి శ్రీనివాసరావు తదితరులు విమానాశ్రయంలో ఘన స్వాగతం పలికారు.

వీడ్కోలు

తిరుపతి పర్యటన అనంతరం రేణిగుంట విమానాశ్రయానికి చేరుకుని గవర్నర్‌కు కలెక్టర్‌ వెంకటరమణారెడ్డి, ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి, లైజన్‌ ఆఫీసర్‌ భాస్కర్‌నాయుడు, శ్రీకాళహస్తి ఆర్డీఓ రామారావు, తహసీల్దార్లు శివప్రసాద్‌, ఉదయ్‌సంతోష్‌, ఎయిర్‌ పోర్ట్‌ చీఫ్‌ సెక్యూరిటీ ఆఫీసర్‌ రాజశేఖర్‌రెడ్డి తదితరులు వీడ్కోలు పలికారు.


రేణిగుంట విమానాశ్రయంలో గవర్నర్‌కు వీడ్కోలు పలుకుతున్న కలెక్టర్‌ వెంకటరమణారెడ్డి

అసైన్డ్‌ భూములకు..పట్టా భూములకు తేడాలేదా?

చిల్లకూరు: రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత భూముల విలువలు పెరిగింది. స్థానికంగా ఉన్న కొంతమంది రైతులు తమ భూములను విక్రయించుకునేందుకు ముందుకు వచ్చారు. ఈ క్రమంలోనే చెన్నై ప్రాంతానికి చెందిన వ్యక్తులు ఈ ప్రాంతంలో భూములు కొనుగోలు చేస్తున్నారు. జాతీయ రహదారి వెంబడి ఉన్న పట్టా భూములను చెన్నై, హైదరాబాద్‌ తదితర ప్రాంతాలకు చెందిన వారు కొనుగోలు చేసి వాటిని అభివృద్ధి చేసుకుంటున్నారు. వాస్తవాలు తెలుసుకోకుండా జాతీయ రహదారి వెంబడి అసైన్డ్‌ భూములు అధికార పార్టీ నాయకులు ఆక్రమిస్తున్నారంటూ ఈనాడులో రెండు రోజుల క్రితం ×పేదల చేజారి..పెద్దలను చేరి॥ అంటూ అసత్యకథనాన్ని ప్రచురించడంపై స్థానికులు మండిపడుతున్నారు.

పోర్టు అనుసంధాన రహదారి పైనా అవాస్తవాలే

చిల్లకూరు మండలం, వరగలి క్రాస్‌ రోడ్డు నుంచి తూర్పు కనుపూరు వరకు సాగరమాల పేరుతో పోర్టు అనుసంధాన రహదారి నిర్మిస్తున్నారు. సుమారు 12 గ్రామాల మీదుగా 23 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మించనున్నారు. ఈ రహదారికి ఇరువైలా పట్టా భూములే ఎక్కువగా ఉన్నాయి. కేవలం ఐదు శాతానికి పైగా అసైన్డ్‌ భూములు ఉన్నాయి. రహదారి నిర్మాణం కోసం ఇప్పటికే 370 ఎకరాల భూమిని సేకరించారు. అయితే ఇప్పుడు పోర్టు అనుసంధాన రహదారికి సమీపంలోని అసైన్డ్‌ భూములపై వైఎస్సార్‌సీపీ నాయకులు వాలిపోయారంటూ ఆ పచ్చపత్రిక ప్రత్యేక కథనాన్ని ప్రచురించింది. దీనిపై భూ నిర్వాసితులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కన్వర్షన్‌కు దరఖాస్తు చేయలేదు

జాతీయ రహదారి వెంబడి ఉన్న పట్టా భూములలో కొంతమంది అభివృద్ధి చేసుకుంటున్నట్లు తెలిసింది. అయితే ఆ భూముల యజమానులు వ్యవసాయేతర భూమిగా మార్పు చేసుకునేందుకు ఇప్పటి వరకు దరఖాస్తులు చేసుకోలేదు.

- శ్రీనివాసులు, తహసీల్దార్‌, చిల్లకూరు

ప్రియురాలు మాట్లాడలేదని యువకుడి ఆత్మహత్య

పిచ్చాటూరు: ప్రియురాలు మాట్లాడలేదని ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన నాగలాపురం ధర్మరాజు గుడి వద్ద చోటుచేసుకుంది. నాగలాపురం ఎస్‌ఐ హనుమంతప్ప కథనం మేరకు.. నాగలాపురంలోని ధర్మరాజుల గుడి వీధికి చెందిన తులసీరామ్‌(21) అదే ప్రాంతానికి చెందిన ఓ బాలికను రెండేళ్లుగా ప్రేమిస్తున్నాడు. కొంతకాలంగా ఆ బాలిక మాట్లాడకపోవడంతో మనస్తాపానికి గురయ్యాడు. ఈ క్రమంలో గురువారం రాత్రి యువకుడు బాలిక ఇంటికి వెళ్లగా ఆ సమయంలో బాలిక తల్లిదండ్రులు తులసీరామ్‌తో దురుసుగా ప్రవర్తించారు. దీంతో నాగలాపురంలోని వాసవీకన్యకాపరమేశ్వరి ఆలయం వద్ద ఉన్న చెట్టుకు తులసీరామ్‌ ఉరి చేసుకొని తనువు చాలించాడు. యువకుని తల్లి జ్యోతి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


తులసీరామ్‌(ఫైల్‌)